వినూత్న ప్రాజెక్టుల దిశగా నర్సింహారెడ్డి కళాశాల



ఒప్పందంపై సంతకాలు చేస్తున్న నర్సింహారెడ్డి కళాశాల, సోహమ్ అకాడమీ ప్రతినిధులు

పోచారం: విద్యార్థులను వినూత్నమైన ప్రాజెక్టుల వైపు తీర్చిదిద్దాలని సోహమ్ అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సెలెన్స్‌తో చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎమ్ఓయూ (ఒప్పందం) చేసుకున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒప్పందం పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సోహమ్ అకాడమీ డైరెక్టర్ సహదేవ్ మాట్లాడుతూ.. విద్యార్థులచే రోబోటిక్స్‌పై ఓ ఆసక్తికరమైన ప్రాజెక్టు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ జనార్దన్‌రాజు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ రవి బోలిమెరా, రోబోటిక్స్ క్లబ్ కోఆర్డినేటర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో మూడు రోజుల వర్క్‌షాపు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మైక్రోసాఫ్ట్ పవర్ బీఐ పై వర్కు షాపును ప్రొవోక్ ఐటీ సొల్యూషన్స్ సహకారంతో నిర్వహించారు. 3 రోజులు పాటు నిర్వహించిన వర్క్‌షాప్ కార్యక్రమానికి విప్రోలో టెక్నికల్ లీడ్ ప్రవీణ్ హాజరై డేటా విజువలైజేషన్, రిపోర్టింగ్, డేటా ఇంటిగ్రేషన్, ఆర్థిక విశ్లేషణ, మార్కెటింగ్ వంటి ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు, ప్రిన్సిపల్ లోకనాథం, కోఆర్డినేటర్ సౌమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాపారంపై యువత దృష్టి సారించాలి



వాద్వానీ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుంటున్న మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్

మేడ్చల్‌రూరల్: వ్యాపారంపై యువత దృష్టి సారించాలని వాద్వానీ ఫౌండేషన్ సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ అమిత్‌సింగ్ అన్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ పారిశ్రామిక వేత్తల దినోత్సవం సందర్భంగా శనివారం వ్యవస్థాపక నైపుణ్యాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ సింగ్ మాట్లాడుతూ.. యువత వినూత్నమైన ఆలోచనలతో ముందుకు వస్తే తగిన ప్రోత్సాహాన్ని అందించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని వివరించారు. అనంతరం ప్రిన్సిపల్ మాధవిలత మాట్లాడుతూ.. వ్యవస్థాపక సామర్థ్యాలను మెరుగు పర్చడానికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను వాద్వాని సంస్థ నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు డాక్టర్ గంగా దినేష్ కుమార్, అబ్దుల్ రహీం, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీబీఐటీ కబడ్డీ క్రీడాకారులకు అభినందనలు



ఘట్‌కేసర్: అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజనీరింగ్ కళాశాల (వీబీఐటీ) కార్యదర్శి డాక్టర్ జి.మనోహర్‌రెడ్డి ఆ కళాశాల కబడ్డీ క్రీడాకారులను శనివారం అభినందించారు. ఇటీవల మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన స్టేట్ లెవల్ కబడ్డీ పురుషుల టోర్నీలో అవుషాపూర్ వీబీఐటీ కబడ్డీ క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల కార్యదర్శి మనోహర్‌రెడ్డి క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ నీలిమ, ఎవిల్ హెచ్ఓడీ రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సహాయ పీడీలు మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న రవిగౌడ్

బోడుప్పల్: చెంగిచర్లలోని బీఎంఆర్ఎస్ గ్రామర్‌స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కొత్త రవిగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా అన్ని రకాల క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే కంప్యూటర్‌లో శిక్షణ ఇవ్వాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

కాప్రా: ఉప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఏఎస్‌రావునగర్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఉప్పల్ భగాయత్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తే నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, ప్రభుత్వం ఉప్పల్‌కు డిగ్రీ కాలేజీ మంజూరు చేసిందని తెలిపారు. ఏబీవీపీ నేతలు బుర్ర అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దవాఖానాల్లో మందుల్లేవ్...!

- వ్యాధులు విజృంభిస్తున్న వేళ.. పీహెచ్‌సీల్లో మందుల కొరత
- యాంటీబయాటిక్స్ పరిమితమే
- నొప్పులు, రక్తపోటు, షుగర్‌కు సంబంధించిన మందులు కరువే
- పక్క జిల్లాల నుంచి సర్దుబాటు చేస్తున్న వైద్య సిబ్బంది



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వ్యాధులు విజృంభిస్తున్న వేళ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత రోగులను ఇబ్బందులకు గురిచేస్తోంది. సాధారణ జ్వరాలు, ఇతర వ్యాధులతో దవాఖానాలకు రోగులు బారులుదీరుతున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా అన్ని ప్రాథమిక గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు జ్వర పీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. విభిన్న వాతావరణ మార్పులతో పలువురు అనారోగ్య సమస్యలకు అవస్థలు పడుతున్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ కేసులు కూడా నమోదు అవుతున్నాయి. పిల్లలు, వృద్ధులు, పెద్దలనే తేడా లేకుండా రోగాల బారిన పడుతున్నారు.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (మేడ్చల్, ఘట్కేసర్, శామీర్‌పేట) ఉన్నాయి. అలాగే 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ఇందులో 11 పీహెచ్‌సీల్లో డెలివరీ పాయింట్స్ ఉన్నాయి. 26 యూపీహెచ్‌సీలు ఉండగా, ఇందులో 6 డెలివరీ పాయింట్స్ ఉన్నాయి. 103 పల్లె, 71 బస్తీ దవాఖానాలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. జిల్లాలో 24 గంటలు పని చేసే 13 ఆసుపత్రుల్లో 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ప్రతీ రోజు ఓపీలో భాగంగా బయటి రోగుల సంఖ్య సాధారణంగా 80 నుంచి 125 ఉండగా, ప్రస్తుత వ్యాధుల సీజన్‌లో 200 దాటుతోంది. ఏరియా, కమ్యూనిటీ ఆసుపత్రుల్లో ఇంకా అధికంగా ఉంటోంది. వీటిపరిధిలో జ్వర బాధితులు ఎక్కువ మంది నమోదవుతున్నారు. కానీ, ఆయాచోట్ల సిబ్బంది కొరతకు తోడు మందుల కొరత నెలకొంది. కనీసం డైక్లోఫినాక్ మాత్రలు అందుబాటులో లేని దయనీయ పరిస్థితి నెలకొంది. యాంటీబయాటిక్స్ నిల్వలు కొంత వరకే ఉన్నాయి. కీళ్ల నొప్పులు, జలుబు, షుగర్, రక్తపోటుతో పాటు.. చర్మ వ్యాధులకు సంబంధించిన మాత్రలు, దురదలకు సంబంధించిన ఆయింట్‌మెంట్స్ కొరత కూడా తీవ్రంగానే ఉంది.

సర్దుబాటు చేస్తున్నాం



జిల్లాలో నిరంతరంగా జ్వరం సర్వే కొనసాగిస్తున్నాం. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలో అందుబాటులో ఉన్న మందులకు తోడు రోగులకు అవసరమయ్యే మందులను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి సర్దుబాటు చేస్తున్నాం. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డాక్టర్. రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్ఓ

కీసరగుట్టలో భక్తుల రద్దీ



శివలింగాల వద్ద భక్తుల పూజలు



స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తజనం

కీసర: కార్తీకమాసం ప్రభుత్వ సెలవు దినం కావడంతో శనివారం కీసరగుట్టకు భక్తుల రద్దీ పెరిగింది. కార్తీక మాసంలో శివుడిని దర్శించుకొని, కార్తీక దీపాలు వెలిగిస్తే మంచి జరుగుతుందన్న విశ్వాసంతో కీసరగుట్టకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శనివారం ఉదయం నుంచి కీసరగుట్ట భవానీరామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. స్వామివారి దర్శనానంతరం యాగశాల మండపం వద్ద కార్తీక దీపాలు వెలిగించడంతోపాటు, కీసరగుట్ట ఆంజనేయస్వామి ఆలయం పరిసరాల్లో ఉన్న శివలింగాలకు పాలు, పెరుగు తదితర పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు. ఉదయం గర్భాలయంలో కొలువైన స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం క్షీరాభిషేకం పూజను కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: అత్వెల్లి, ఎల్లంపేట్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ మౌలాలి తెలిపారు. ఎల్లంపేట్ పరిధిలోని అన్ని పరిశ్రమలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అత్వెల్లి రేకుల బావి క్రాస్ రోడ్, డబీల్‌పూర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలు

శామీర్‌పేట్: విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలు దోహదపడతాయని మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయకుమారి అన్నారు. శనివారం తూంకుంట మున్సిపాలిటీలలోని విజ్ఞాన భారతి స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే చెస్ కాంపిటీషన్ 68వ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీలకు తెలంగాణలోని పలుజిల్లాల నుంచి 200 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయిలో జరిగే చెస్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



బోడుప్పల్: సన్‌ఫైటర్స్ కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 11వ నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీల బ్రోచర్‌ను శనివారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకోవాలని చెప్పారు. పురుషులతో పాటు మహిళలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ నంద ప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కాప్రా: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి సూచించారు. శనివారం డివిజన్ పరిధిలోని సీఎస్‌నగర్, వినాయక్‌నగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు. దీనిలో భాగంగానే కాప్రా డివిజన్‌కు స్పెషల్ ఫండ్ తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. స్థానిక కాలనీవాసులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధితో వ్యక్తి మృతి

పోచారం: ఫిట్స్‌తో బాధపడుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5న అన్నోజిగూడలోని మోడీ ఎమరాల్డ్ పార్కు వద్ద ఫిట్స్‌తో బాధపడుతున్న ఓ వ్యక్తిని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి, 108 అంబులెన్స్ సిబ్బంది సహాయంతో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి శనివారం మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వయస్సు 45–50 మధ్య ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

సమగ్ర సర్వే పరిశీలన



అలియాబాద్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్ పోట్రు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో శనివారం ప్రారంభమైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చైర్‌పర్సన్ పావనీ జంగయ్య, కమిషనర్ చంద్రశేఖర్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీల సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ ఉన్నతికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేలో ఎన్యూమరేటర్లకు పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరు కులగణనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోచారంలో..

మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో శనివారం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధిక గుప్తా పరిశీలించారు. ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో చెరుకు సంధ్య ఇంటి వద్ద కుటుంబ సభ్యుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. సర్వే చేస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వీరారెడ్డి, మేనేజర్ అంజన్‌రెడ్డి, కౌన్సిలర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్‌లో..

ప్రజలు స్వచ్ఛందంగా తెలిపిన వివరాలను మాత్రమే నమోదు చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర సర్వే శనివారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా శామీర్‌పేట మండలం, అలియాబాద్ గ్రామంలో కలెక్టర్ పర్యటించి సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. సర్వే ప్రొఫార్మాలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌నగర్‌లో..

జవహర్‌నగర్: అంబేడ్కర్‌నగర్‌లో శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన పూర్తి సర్వేని ఎన్యూమరేటర్లు ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకున్నారు. అదే విధంగా కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పలు ప్రాంతాల్లో సర్వేని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కీసరలో..

కీసర: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను దమ్మాయిగూడ మున్సిపాలిటీలో అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా మున్సిపల్ కమిషనర్ నాగమణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా మాట్లాడుతూ.. ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి వివరాలను అందజేయాలన్నారు. ఎన్యూమరేటర్ సిబ్బంది వచ్చే సమయానికి ఆధార్, రేషన్‌కార్డు, ధరణి పాస్‌బుక్ తదితర ఆధారాలను సిద్ధంగా ఉంచుకొని వారికి సహకరించాలని సూచించారు. ఎన్యూమరేటర్లు చేపడుతున్న సమగ్ర సర్వే తీరును ఆమె పరిశీలించి పలు సూచనలు చేపట్టారు. ఇదిలా వుండగా నాగారం మున్సిపల్ పరిధిలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని 19, 913 గృహాలకు సంబంధించి సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు.



ఘట్‌కేసర్‌లో.. చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ చంద్రశేఖర్



ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో.. అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



అంబేడ్కర్‌నగర్‌లో సర్వే వివరాలను అడుగుతున్న ఎన్యూమరేటర్లు

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



లక్ష్మాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



తహసీల్దార్ నూతన భవన పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి విచ్చేసే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ భవనాన్ని పరిశీలించి, జగ్గంగూడలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు.

కీసర: కీసరలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ. 2,320, కామన్ రకానికి రూ. 2,300 చెల్లిస్తుందన్నారు. సన్నరకానికి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు, బోనస్‌గా రూ. 500 చెల్లిస్తుందన్నారు. రైతులు వరికోసేసాక, తాలు, చెత్త లేకుండా చూసుకోవాలని, తేమ శాతం 17 ఉండేటట్లుగా చూసుకోవాలన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలన్నారు. ఏఓ మాధవిలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

పెద్ద ఎత్తున సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు



స్వామిసేవలో కీసర ఆర్డీవో సైదులు, తహసీల్దార్ అశోక్‌కుమార్ తదితరులు

కీసర: భక్తుల కొంగు బంగారంగా పేరొందిన చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం పెద్ద ఎత్తున సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు చీర్యాల ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ మండపంలో నిర్వహించిన సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు పాల్గొన్నారు. వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో పూజా సామాగ్రిని అందజేశారు. కీసర ఆర్డీవో సైదులు, తహసీల్దార్ అశోక్ కుమార్ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామి దర్శనానంతరం వేద పండితులు స్వామివారి ఆశీర్వచనంతోపాటు, మహా ప్రసాదాన్ని ఆర్డీవో, తహసీల్దార్‌కు అందజేశారు. అనంతరం ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ స్వామివారి చిత్రపటాని బహుకరించారు.

ఆలయాల ఆదాయం కోసమే నిర్మాణాలు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాప్రా గ్రామాభివృద్ధి సమిష్టి సంఘం ప్రతినిధులు

కాప్రా: కాప్రా ప్రభుత్వం స్కూల్ సమీపంలోని గ్రామకంఠం భూమిలో చేపట్టిన నిర్మాణాలు ఆలయాల అభివృద్ధి కోసమేనని కాప్రా గ్రామాభివృద్ధి సమిష్టి సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం, పోచమ్మ ఆలయాలకు ఎలాంటి ఆదాయ మార్గాలు లేకపోవడంతో గ్రామకంఠం స్థలంలో షెటర్లు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. వీటి ద్వారా వచ్చే అద్దెలతో ఈ ఆలయాల్లో దూపదీప నైవేద్య ఖర్చులు, అర్చకుల వేతనాలు కొంతమేరనైనా భర్తీ చేయవచ్చనే ఆలోచనతో గ్రామస్తులందరూ కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దాదాపు 60 గజాల ఈ స్థలం గ్రామం మధ్యలో ఉండటంతో కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అలా జరగకుండా గ్రామం కోసం ఉపయోగపడేలా ఆలయాలకు నిధులు సమకూర్చేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. నిర్మాణాలకు ఎలాంటి అడ్డంకులు రాకుండా చూడాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కోరామన్నారు. బీఆర్ఎస్ నేతలు బైరి నవీన్‌గౌడ్, సంఘం గౌరవ అధ్యక్షులు కొప్పుల కుమార్, ప్రతినిధులు అశోక్‌కుమార్, నవీన్‌కుమార్, శ్రీనివాస్, నరేందర్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి సేవా కార్యక్రమాలు అవసరం



దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

పోచారం: ప్రతి మనిషి సమాజానికి తన వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాలు చేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం అన్నోజిగూడలోని వికలాంగుల కాలనీలో శ్రీకృష్ణా యూత్ అసోసియేషన్ సహకారంతో దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్, పోచారం మున్సిపల్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిట్స్ పిలానీలో యంగ్ రీసెర్చర్స్ వర్క్‌షాప్



బిట్స్ పిలానీ క్యాంపస్ వర్క్‌షాప్‌లో పరిశోధన విద్యార్థులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో యంగ్ రీసెర్చర్స్ కాన్‌క్లేవ్, అడ్వాన్స్‌డ్ నానో–మైక్రో ఫ్యాబ్రికేషన్‌పై డీఎస్‌టీ–ఎఫ్ఐఎస్‌టీ ప్రాజెక్టులో భాగంగా రెండు రోజుల వర్క్‌షాప్‌ను శనివారం నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కి సమీపంలోని యూనివర్సిటీల నుంచి పరిశోధన విద్యార్థులు హాజరవ్వగా, పలువురు ప్రొఫెసర్లు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బిట్స్ పిలానీ సిబ్బంది, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.